క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కమిషనర్ తెలియజేశారు.

27న జాబ్‌మేళా

వేముల: వేముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుగుణావతి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బీజెడ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఆల్ డిక్సన్ కంపెనీ వారు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని.. టెన్త్, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలన్నారు.

ఎర్రగుంట్ల ఎంపీడీఓ బదిలీ

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండల ఎంపీడీఓ ఎస్.భాగ్యలక్ష్మీ నంద్యాల జిల్లాలోని రుద్రవరం మండలానికి బదిలీ అయ్యారు. 2023 జూన్ నెలలో ఎర్రగుంట్ల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆమె సోమవారం రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రహంతులయ్య కొనసాగుతున్నారు.

కల్లు సీసాలు పట్టివేత

జమ్మలమడుగు రూరల్: మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమంగా కల్లు విక్రయిస్తున్న ఒక వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ పోలీస్ అధికారులు తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు 50 కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2900లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు.

మహిళను ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు


ఆశ్రమానికి మహిళను తీసుకెళ్తున్న సంస్థ సభ్యులు

వేంపల్లి: స్థానిక హనుమాన్ జంక్షన్ సమీపంలో మతిస్థిమితం లేకుండా ఒంటరిగా తిరుగుతున్న మహిళను సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి కడప మనో బంధు ఫౌండేషన్ సంస్థ యాజమాన్యంతో మాట్లాడి ఆశ్రమంలో చేర్చుకోవాల్సిందిగా కోరారు. వేంపల్లి కానిస్టేబుళ్లు మహమ్మద్ అలీ, మహిళా కానిస్టేబుల్ పార్వతి కలిసి ఆమెను కడప రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెను మనో బంధు ఫౌండేషన్‌లో సీఐ సురేష్‌రెడ్డి చొరవ తీసుకుని ఆమె ఆశ్రయానికి కావాల్సినటువంటి ఏర్పాట్లను చూడాలని ఆశ్రమ నిర్వాహకులను కోరారు. సహృదయంతో స్పందించి మహిళకు ఆశ్రయం కలిపించడంతో వేంపల్లె పోలీసులను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్: పులివెందుల పోలీసులు అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ఉచిత సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ మురళీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో దొంగల బెడద నుంచి తప్పించుకోవాలంటే ప్రతి ఒక్కరూ మీ ఇంటి భద్రత కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ పథకం మీ ఇంటి నుంచి మొబైల్ అప్లికేషన్ ద్వారా రిజిస్టర్ కావాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు మీ ఇంటి వద్ద ఎల్‌హెచ్‌ఎంఎస్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా భద్రత కల్పిస్తారన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

పులివెందుల టౌన్: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని కళాశాల ప్రిన్సిపల్ లీలావర్ధన్ తెలిపారు. పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ అండ్ నియంత్రణ సంస్థ సీడీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సీడీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ వల్లి, నాగిన్ బాషా, అనురాధ, పుష్పరాజు, శాంతి, సీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజృంభిస్తున్న దోమలు.. జ్వరాల బారిన ప్రజలు

- పారిశుధ్య పనులు పట్టని అధికారులు
- రోగుల సంఖ్య పెరుగుతున్న నిర్లక్ష్యంగా వైద్యాధికారులు

ఎర్రగుంట్ల: మునిసిపాలిటీతోపాటు మండలంలో దోమలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు దోమలు స్వైర విహారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కాటుకు గురవుతున్న ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉండే ఖాళీ స్థలాల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరగడం దోమల వృద్ధికి కారణమవుతోంది. దోమల బారిన పడిన రోగులతో ఆసుపత్రులు నిండుతున్నాయి. దోమలు నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకెందుకు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అలానే వైద్య శిబిరాల నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

- ఎర్రగుంట్ల పట్టణంతో పాటు మండలంలో పారిశుధ్య నిర్వహణ లోపించింది. దీంతో నివాస ప్రాంతాల్లో క్యూలెక్స్, ఎనాఫిలస్, ఏడీస్ దోమలు పుట్టుకొస్తున్నాయి. ఇవి ప్రజలపై దాడి చేస్తుండటంతో మండల వాసులు డెంగీ, మాలేరియా వ్యాధుల బారిన పడిన రోగుల సంఖ్య గణనీయంగా ఉంది. ఇప్పటికైన మునిసిపల్, మండల అధికారులు దోమల బారి నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకాశ్‌నగర్‌లో డెంగీ కేసు

ప్రకాశ్‌నగర్ కాలనీలో డెంగీ కేసు రెండు రోజుల క్రితం నమోదైంది. దోమల సంఖ్యలో కాలనీలో అధికంగా ఉందంటూ స్థానికులు తెలియజేశారు. డెంగీ కేసు నమోదైనప్పటికి అటు మున్సిపల్ అధికారులు, ఇటు వైద్యాధికారులు కాలనీ పర్యటించి పారిశుధ్య పనులు చేపట్టి దోమల నివారణను కట్టడి చేయాల్సి ఉండగా పట్టించుకున్న పాపానపోలేదు. స్థానికుల రక్తన మూనాల సేకరించిన వైద్య సిబ్బంది, దోమల నివారణ, కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంలేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.


ప్రకాశ్‌నగర్ కాలనీలో రక్త నమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ


రామకృష్ణారెడ్డి భార్య గంగమ్మను ఓదార్చుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల: వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. లింగాల మండలం బోనాల గ్రామానికి చెందిన ఇద్దరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి ఇంటికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆదుకుంటామని, మేమున్నామని ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన పోచంరెడ్డి రామకృష్ణారెడ్డి నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో.. 5 రోజుల క్రితం మృతి చెందాడు. ఆ సమయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఆయన ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు రామాంజులరెడ్డితో జరిగిన పరిణామాలపై చర్చించారు. అనంతరం రామకృష్ణారెడ్డి భార్య గంగమ్మను ఓదార్చి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన సర్పంచ్ రాము తండ్రి యమ్మనూరు రామిరెడ్డి అనే వైఎస్సార్‌సీపీ నాయకుడు మూడు రోజుల క్రితం మృతి చెందాడు. వారి ఇంటికి ఎంపీ వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, తామున్నామని భరోసా కల్పించారు. అదే విధంగా గత పది రోజుల క్రితం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ పాము కాటుకు గురయ్యాడు. ఆయన ఇంటి వద్దకు వెళ్లి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా నయం కావాలని ఎంపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బోనాల గ్రామ నాయకులు గోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రిరెడ్డి, సైదాపురం సురేష్, వెలిదండ్ల మల్లికార్జునరెడ్డి, అంకేవానిపల్లె, బోనాల తదితర గ్రామాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంస్కృతిక యువజనోత్సవాలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లి: రాష్ట్రస్థాయి సాంస్కృతిక యువజన ఉత్సవాలకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన కడపలోని స్పిరిట్ కాలేజీలో స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాల పోటీలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వివిధ సాంస్కృతిక విభాగాలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. జానపద బృంద నాట్యానికి మొదటి బహుమతి, జానపద సోలో విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, జానపద బృంద గానంలో మొదటి బహుమతి, జానపద గీతం సోలో మొదటి బహుమతి, కవిత్వం విభాగంలో ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారని తెలిపారు. బహుమతులు సాధించడం పట్ల డైరెక్టర్‌తోపాటు పరిపాలనాధికారి రవికుమార్, ఫైన్ ఆర్ట్స్ హెచ్‌ఓడీ పీ.ఎం ఖాన్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

మన శరీరంలో సగానికిపైగా సూక్ష్మజీవులే


మైక్రో బయాలజీ రీసెర్చర్ హరీష్‌ను సన్మానిస్తున్న విద్యార్థినులు

పులివెందుల టౌన్: మన శరీరంలో సగానికిపైగా సూక్ష్మ జీవులేనని మేఘాలక సెంట్రల్ యూనివర్సిటీ మైక్రో బయాలజీ రీసెర్చర్ హరీష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సూక్ష్మజీవులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన శరీరంలో సగానికి పైగా శరీరాన్ని ఆవాసంగా చేసుకొని సూక్ష్మజీవులు నివసిస్తాయని, మనం ఎంత శుభ్రంగా కడిగినా మన శరీరం మూలల్లో, పగుళ్లు, చీలికలలో సూక్ష్మజీవులు ఉంటాయన్నారు. జీర్ణ క్రియల వ్యాధి నిరోధక వ్యవస్థను నియంత్రించడంలోనూ, కీలకమైన విటమిన్లను తయారు చేయడంలో సూక్ష్మజీవుల పాత్ర గురించి రహస్యాలను శాస్త్రవేత్తలు వేగంగా కనుక్కుంటున్నారన్నారు. ప్రాణాంతక వ్యాధులు కలిగించే సూక్ష్మజీవులపై వాడే యాంటీబయాటిక్స్ మన శరీరంలో మంచి బాక్టీరియాకు నష్టం కలిగిస్తాయన్నారు. ఈ సూక్ష్మజీవుల డీఎన్ఏ, నత్రజని క్రమం ఎలా కనుక్కోవాలో సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, పీఆర్‌ఓ బాల నారాయణ, జంతు శాస్త్ర హెచ్‌ఓడీ శ్రీనిత రెడ్డమ్మ, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూమి వేలం

పెద్దముడియం: మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న వంకదార సుబ్బయ్య సత్రానికి చెందిన 10.40 ఎకరాలను 3 సంవత్సరాల కౌలుకు ఎండోమెంట్ అధికారులు సోమవారం రోజు వేలం పాటను నిర్వహించారు. వేలం పాటను గ్రామంలోని మాధవ స్వామి దేవాలయంలో నిర్వహించగా గ్రామానికి చెందిన తులసి ఈశ్వరరెడ్డి రూ.2,53,000 భూమిని కౌలుకు దక్కించుకున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పులివెందుల రూరల్ : పొలంబడి పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, అధికారులు

పులివెందుల రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతన్న సేవలో వ్యవసాయ శాఖ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పొలంబడి పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. పులివెందులలో డివిజన్ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి పిలుస్తోంది పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాలలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో కలిసి పొలాల్లో నాణ్యమైన పంట దిగుబడులు పండించడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు అందించే విధంగా చూడాలన్నారు. అలాగే ఆధునిక సాంకేతిక పరికరాలను అందించే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొరత లేకుండా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయాధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారులు నాగలక్ష్మి, చెన్నారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు

లింగాల: లింగాల మండలం పెద్దకుడాల గ్రామ సచివాలయం ప్రాంగణంలో సోమవారం మండల స్పెషలాఫీసర్ మురళీమోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ లోకేశ్వరరావు, మండల పశువైద్యాధికారి మంగేష్, టీడీపీ మండల నాయకులు విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి, గ్రామ రైతుల సమక్షంలో మండల వ్యవసాయాధికారి రమేష్ పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ మంగళ, బుధవారాలలో రోజుకు రెండు గ్రామాల చొప్పున ఉదయం రైతుల పొలాల క్షేత్ర సందర్శన, మధ్యాహ్నం ఆయా రైతు సేవ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది మౌనిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

కమలాపురం: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తామని మండల ఏఓ సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండలంలోని మీరాపురం, పుట్లంపల్లె గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టికల్చర్, వెటర్నరీ, సిరికల్చర్ విభాగాల సిబ్బంది కూడా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల పంట పొలాల్లో పర్యవేక్షించి తగు సలహాలు, సూచనలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి వారం మంగళ, బుధవారాలలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పాల్గొని అధికారుల సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత

- పులివెందులలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ
- ప్రారంభించిన ప్రముఖులు


ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

పులివెందుల టౌన్: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా సోమవారం పులివెందుల మున్సిపాలిటీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రనాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలతోపాటు చుట్టూ పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా 2024'లో భాగంగా 15 రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు పూలంగళ్ల సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ఆరోగ్యంగా ఉందాం, ప్లాస్టిక్ నిర్మూలిద్దాం, ప్లాస్టిక్ రహిత భారతావనిని నిర్మిద్దాం అని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలి


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త అంకయ్య

వేంపల్లి: వరి పంటలో ఎండు ఆకు తెగులు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అంకయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఇడుపులపాయ, కుమ్మరాంపల్లె, వీరన్నగట్టుపల్లె గ్రామాలలో వరి పంటను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా వరి పంటలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగుళ్లను గుర్తించారు. ఇది ఎక్కువగా గాలి, నీటి ద్వారా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంక్రమిస్తుందన్నారు. ఇది ఆకు లోపలికి ప్రవేశించడం వల్ల ఆకు అంచు నుంచి పసుపు రంగులోకి మారి క్రమంగా నీటి డాగ్ రూపంలో ఎండిపోవడం జరుగుతుందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల రాత్రిళ్లు ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు సేంద్రియ పద్ధతులలో 200 లీటర్ల నీటికి ఒక లీటర్ ట్రైకోడెర్మా, 1 లీటర్ సుడో మోనస్ కలిపి ఒక ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. అలాగే రసాయనిక పద్ధతులకు సంబంధించి నత్రజని ఎరువులను ఒక దఫా వాయిదా వేసుకుని ఎకరాకు 15– 20 కేజీల పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. తెగులు సోకిన పొలం నుంచి వచ్చిన నీటిని మరొక పొలానికి రానివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌ఎఫ్‌సీఓ వికాస్, సర్టిఫికేషన్ కోఆర్డినేటర్ భవాని, అశోక్, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తోలితే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

పులివెందుల రూరల్: పులివెందుల మండల ప్రజలు ఎక్కడైనా సరే ప్రభుత్వ భూమి, పట్టా భూములకు సంబంధించి అయినా మట్టి తోలుకోవాలనుకుంటే అనుమతులు తీసుకోవాలని, అలా కాకుండా మట్టి తోలితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ రైతులు ఏదైనా ఎగుడు దిగుడు గట్టుకు సంబంధించి సమానం చేసుకోవాలనుకున్నప్పుడు మాకు ఒక అర్జీ ఇవ్వాలని, దాన్ని మేము మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపించడం జరుగుతుందని, అక్కడి నుంచి అనుమతి ఇచ్చిన తర్వాత.. ఎన్ని క్యూబిక్ మీటర్లు పొందుపరిచి ఉంటారో అంతవరకే తీసుకోవాల్సి వస్తుందన్నారు. అది కూడా ఉదయం పూట తోలుకోవాలన్నారు. మట్టి తోలుతున్నారని గత కొన్ని రోజుల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి తన దృష్టికి రావడం జరిగిందని తెలిపారు. తాను వెంటనే ఆ గ్రామాల్లో సంబంధిత అధికారులకు చెప్పడం జరిగిందని, అలాంటివి ఏమి జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పడం జరిగిందన్నారు. మోట్నూతలపల్లె గ్రామంలో మట్టి తోలుతున్నారని సమాచారం రావడం జరిగిందని, వెంటనే ఆర్ఐ, వీఆర్ఓను అక్కడికి పంపించామన్నారు. అనుమతులు లేకుండా మట్టి తోలితే మాత్రం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ముగిసిన మండల క్రీడా పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ముద్దనూరు: మండలస్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీలలో పలువురు క్రీడాకారులు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు మాధవరెడ్డి తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే ప్రతిభ చాటాలి


చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రాలు విడుదల చేస్తున్న కరస్పాండెంట్, జేవీవీ సంస్థ ప్రతినిధులు

వేంపల్లి: ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే తమ ప్రతిభను చూపాలని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 25న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ గుర్తింపు సాధించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు బాలబయన్న, గంగాధర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా ఎంపికలు

చింతకొమ్మదిన్నె: మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా ఎంపికలు సోమవారం పోటాపోటీగా సాగాయి. ఈ ఎంపికలను విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి, రుద్రమూర్తి యాదవ్ ప్రారంభించారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరగ్గా బయనపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ క్రీడా ఎంపికలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య సంరక్షణ

వేముల: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా పేర్కొన్నారు. మండలంలోని గొల్లలగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు విటమిన్లతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా ప్రతి రోజు ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు తీసుకుని పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే తల్లి గర్భస్థ దశ నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు తీసుకోవాల్సిన ఆహారం, పోషక విలువల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, సహాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన

సింహాద్రిపురం: మండలంలోని కడపనాగాయపల్లె, లోమడ గ్రామాలలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి సోమవారం పరిశీలించి వీహెచ్ఏలకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, సోయాబీన్ పంట ఎకరాకు మూడు క్వింటాల లోపే దిగుబడి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ భువనేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి


ఈఈగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసులు

పులివెందుల రూరల్: పులివెందుల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఈఈ వై.శ్రీనివాసులు నెల్లూరు జిల్లా నాయుడుపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలో ఈఈగా పని చేస్తున్న ఎస్.శ్రీనివాసులు ఇక్కడికి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉంటే ప్రజలు కానీ, రైతులు కానీ సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. పొలాల్లో చెట్టు కొమ్మలు విద్యుత్ లైన్ల మీద ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వేంపల్లె: స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు వేంపల్లె సీఐ సురేష్ రెడ్డి వెల్లడించారు. సోమవారం తెల్లవారుజామున అందిన సమాచారం మేరకు సీఐతో పాటు సిబ్బంది దాడి నిర్వహించి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పులివెందుల రూరల్: పట్టణంలోని వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా వైద్యకళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ మల్లేశ్వరి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలలో భాగంగా పులివెందుల సర్వజన ఆసుపత్రిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశుధ్య కార్మికులు, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్మికులకు రక్త పరీక్షలతోపాటు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ ఉపాధ్యక్షురాలు సుష్మా, బీజేపీ నాయకులు భానుప్రకాష్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమతుల్య ఆహారాన్నే తీసుకోవాలి

కొండాపురం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందితో కలసి పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు.